


జగన్నాయకులుకి, ఆయన భార్యకి పిల్ల నచ్చింది. బేంక్‌లో ఆఫీసర్‌గా పని చేస్తున్న ఆయన కొడుకుని విశాఖపట్నం నుంచి పిలిపించి పిల్లని చూపించారు. అతనికి పిల్ల నచ్చింది. మళ్ళీ వైజాగ్ వెళ్ళి పోయాడు.

సాంప్రదాయమైన కుటుంబం. అన్ని విధాలా తగిన సంబంధం అని మురిసి పోయారు ముసలివాళ్ళిద్దరూ. ఓ రోజు పిల్లతండ్రి వచ్చాడు జగన్నాయకులు ఇంటికి.

"అబ్బాయి ఏమన్నాడు?" అడిగాడు కుశల ప్రశ్నలు అయాక.

"నచ్చింది. నిశ్చితార్థం గురించి ఆలోచిస్తున్నాం?" చెప్పాడు జగన్నాయకులు కాబోయే వియ్యంకుడితో.

ఇన్‌కంటాక్స్ ఆఫీసర్‌గాచేసి, ఇంకా రెండేళ్లలో రిటైరవబోతున్న ఆయన చెప్పుకొచ్చాడు.

"నాకు నలుగురు ఆడపిల్లలు. ఇది మూడవది. ఇంకా ఒకమ్మాయి పెళ్ళికుంది. మీకు మీ స్తోమతకు తగ్గట్టుగా అన్నీ చేస్తాను. ఎలాంటి లోపం రానివ్వను. ఇరవై వేలుకి మించి ఇవ్వటం నా వల్లకాదు అమ్మాయిపేర నాలుగేళ్ళక్రితం ఇరవై సంవత్సరాలకి పదివేలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసాను రేడియో, టేప్‌రికార్డర్, సారె, గాడ్రేజ్ బీరువా, నరుపులులాంటివి పది వేలరూపాయల విలువచేసేవి ఇస్తాను. తల్లి బంగారం పదిహేనువేల రూపాయల విలువుంటుంది..."

అన్నిటికీ తలూపారు దంపతులిద్దరూ తర్వాత పుత్తరం రాస్తామని చెప్పారు.

"ఎంత పెద్ద సంబంధం ఓ పదివేలిస్తే ంటారేమో ననుకున్నాను" అన్నది ఆవిడ భర్తతో, ఎంతో సంబరంగా.

"మనకొద్దీ సంబంధం" అన్నాడాయన ఆలోచనగా.

"ఏం? ఇంకా మంచి సంబంధం వస్తుందనా?"

"కాదే పిచ్చిదానా. ఆయన చెప్పినదాన్ని బట్టి దాదాపు ఏభైవేల రూపాయలు ఏ రూపంలోనైతేనేం ముడతాయి. బేంక్‌లో ఆఫీసర్‌గా చేసే మనవాడికి అంత కట్నం నబా? ఎంతమాత్రం కాదు. ఆ కట్నానికి కలెక్టర్‌ని తేవచ్చు నిజానికి. అయినా మన సంబంధం కోసం ప్రాకులాడుతున్నాడంటే నాకేదో అనుమానంగా వుంది."

"అంటే?"

"ఆ అమ్మాయిలో ఏదో లోపం వుండి వుండకపోతే, వెనకాల ఆస్థయినాలేని మన వాడికి అంత కట్నం? కాలేజీలో నాలుగేళ్ళు చదివిందాయె ఏం ముదనష్టపు సంబంధమో? పదివేలు ఇచ్చుకునే శక్తిగల మామూలు సంబంధం చాలు మనకి"

ఇన్‌కంటేక్స్ డిపార్టుమెంట్‌లో అనేక విధాలుగా డబ్బు సంపాదించిన ఆ పిల్ల తండ్రి తను సంపాదించింది తన కూతుళ్ల కోసమే అనే దృష్టితో, పిన్నియర్‌గా కాబోయే వియ్యంకుడికి తను ఇద్దామను కున్నది గొప్పగా, గర్వంగా చెప్పాడు.

ఆయననుంచి తాంబూలాలు పుచ్చుకునేందుకు ఫలానా రోజు వస్తున్నామనే ఉత్తరం కోసం ఎదురు చూడసాగాడు.

జాతకాలు కలవలేదు కాబట్టి తమ సంబంధం సంగతి మర్చిపొమ్మని జగన్నాయకులు వ్రాసిన పుత్తరం అందిందాయనకి.

"అదృష్టం లేదు వాళ్ళకి. బేంక్‌లో ఆఫీసర్‌కి అంత నగదు ఎవరిస్తారు ఈ రోజుల్లో?" అన్నాడాయన తన కూతురితో చిన్నగా నిట్టూర్చి.

